
# టానా ఆంధ్రసచిత్రవారపత్రికల సంయుక్త సాహితీసంబరం పోటీలో బహుమతి పొందిన కథ

## అగ్రిమెంట్



Illustrated by CHALAM

**-అవధానుల సుధాకరరావు**

అతను-ఆమె....
ఇద్దరూ 'టీనేజ్' వయసు వాళ్ళే.

వెరసి-వారిద్దరూ ప్రేమికులు.

ఒకరి మీదొకరికి యిష్టం బాగా పెరిగిపోయి, 'పెళ్ళి'తో తమ అనుబంధాన్ని శాశ్వతం చేసుకోవాలనుకున్నారు.

కాని, పెద్ద వాళ్ళు అంత తేలిగ్గా ఒప్పుకుంటారా? పైగా-నింగి, నేలా కడు దూరం- మన ఇద్దరి కలయిక విడ్డూరం అన్న రీతిగానే, ఆ అబ్బాయి శ్రీమంతుల కుటుంబానికి చెందితే-అమ్మాయి సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించింది.

ఎన్నో అంతరాలు....ఎన్నటికీ కలవని సమాంతర రేఖల్లాంటి ఆ రెండు కుటుంబాల మధ్య 'వియ్యం' కాదు కదా- కయ్యానికైనా వీల్లేని పరిస్థితి.

అయితే ఆ ప్రేమికులు అంత తేలిగ్గా తమ వైఫల్యాన్ని ఒప్పుకుంటారా?

మొండికెత్తారు. "పెళ్ళి లేకుంటే చావు".....ఈ రెండిట్లో మాకే దారి చూపుతారు? అంటూ తమ తమ పెద్దలకి అల్టిమేటం ఇచ్చారు.

చివరికి పెద్దలు సరేననక తప్పలేదు.

కూతురి బలవంతం మీద, అక్కడ ఏ అవమానం ఎదురవుతుందోనని భయపడుతూనే, మధ్యవర్తిని వెంటబెట్టుకుని బయల్దేరాడు ఆడపిల్ల తండ్రి.

గొప్పింటి కోడలు గురించి కలలు కన్న అబ్బాయి జనకుడు-"లక్షణమైన మా అబ్బాయిని అల్లుడిగా పొందాలంటే కనీసం లక్ష రూపాయల కట్నమివ్వాలి..." అని మొదటి షరతు విధించేసరికి, ఆడపిల్ల తండ్రి బేజారెత్తి, వాపసొచ్చేశాడు.

ఆ సాయంత్రం పార్కులో, అమ్మాయి చేత కసిరికొట్టబడిన అబ్బాయి దూకుడుగా, ఇంటికొచ్చేసి, తండ్రి మీద చిటపటలాడేడు. ఫలితంగా కన్యాదాత గార్కి మళ్ళీ కబురు వెళ్ళింది.

కట్నం, కానుకల విషయంలో ఈమారు చిన్న అభిప్రాయ భేదం తలెత్తింది.

ఇలా మరో రెండుసార్లు ప్రతిష్టంభన ఏర్పడి-చివరికి ప్రేమికులిద్దరూ చాలా ఘాటుగా తమ తల్లిదండ్రుల్ని బెదిరించేసరికి-వాళ్ళకి 'కళ్యాణమస్తు' అనక తప్పలేదు.

పెళ్ళి తమ స్వగ్రామమైన 'చిట్యాల'లో జరగాలని ఆడపిల్ల తండ్రి కోరాడు.

వరుడి తండ్రి అందుకొప్పుకుంటూ-స్పెషల్ బస్సు ఏర్పాటు చేసుకొని, ఆ ఖర్చు చెరిసగం భరిద్దామని ప్రతిపాదించేడు. ఒప్పుకున్నాడు అమ్మాయి తండ్రి.

రాత్రి ఎనిమిది గంటల ఏభై నిముషాలకు నిర్ణయించబడిన దివ్యమైన ముహూర్తంలో- నిర్విఘ్నంగా ఆ శుభకార్యం కాస్తా జరిగిపోయింది.

దంపతుల మీద అక్షింతలు వర్షం కురిసింది. జంట చూడముచ్చటగా ఉందని అందరూ మెచ్చుకున్నారు.

మిగతా కార్యక్రమాలు తాపీగా జరుగుతున్నాయి.

గంట, రెండు గంటలు గడుస్తున్నా-ఇంకా భోజనాల హడావుడే లేదు. లోపల ఆకలి విజృంభించేస్తోంది అందరికీ.

అబ్బాయి తండ్రి అసహనంగా-దూర్వాసుడిలా ధుమధుమ లాడుతూ వెళ్ళాడు వియ్యంకుడి వద్దకు.

"ఏవిటయ్యా ఇది? నీకు మంచి, మర్యాదా తెలీదా?" అంటూ రంకెలు లంకించుకున్నాడు.

"ఏం జరిగింది బావగారూ.....?" మహా వినయంగా అడిగేడాయనగారు.

"ఏం నంగనాచివయ్యా! ఆకల్లు... ఏవీ విస్తళ్ళు....? భోజనాలు పెట్టించమని దేబిరించి అడగాలా?"

"అవసరం లేదు బావగారూ! అయిపోయింది. ఇక్కడే వడ్డించేస్తున్నారు."

"ఏవిటి....ఇంత చిన్న గదిలోనా?"

"అవును బావగారూ! మొత్తం ఎంతమందిమి-మీరు ముగ్గురు-మేం ముగ్గురం... అరడజను మందికి ఈ గది సరిపోదా...?" అమాయకంగా అన్నాడు.

"నాతో పరాచికాలా? అవతల పందిట్లో ఉన్న జనం సంగతేవిటి...?" కోపంగా అన్నాడు.

"నాకు సంబంధం లేదు. చూడండి బావగారూ! మీ గొప్పతనం చాటుకోడానికి రెండు బస్సుల్నిండా ఎక్కడెక్కడి జనాన్ని పోగేసుకు తెస్తే-వాళ్ళందరికీ విందులు చెయ్యడానికి నేనేం వశి

"అగ్రిమెంట్" మినీ కథా రచయిత శ్రీ అవధానుల సుధాకరరావు తమ గురించి పరిచయం చేసుకుంటూ -



మూడేళ్ల క్రిందటే మూడు దశాబ్దాల వయసుని పూర్తి చేసుకున్నాను. 70 కథలు, 2 నవలలు సాహితీ ప్రపంచానికి సమర్పించుకున్న నాకు, నా 'మాతృ సంస్థ' అందించిన యీ బహుమతి - ఓ మధురానుభూతి !

కళా ప్రక్రియ యేదైనా - దానికి ప్రయోజనం వుండితీరాలి. అంతేకాదు. అది జీవితానికి అద్దంపట్టి, వాస్తవికతను కూడా ప్రతిబింబించాలి. సంపాదకవర్గానికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు అంటున్నారు.

ప్యిడ్నీ కాను...." అంటూ జేబులోంచి ఓ కాగితం బయటకు తీసాడు.

"ఏమిటది....?"

"మీ సరదా కొద్దీ రాయించి, మీరు స్వయంగా సంతకం చేసిన అగ్రిమెంట్ పత్రం-ముహూర్తాల రోజు మీరేం అన్నారు? నేను పక్కా బిజినెస్ మనిషిని. ఖచ్చితంగా మాట ప్రకారం జరిగిపోవాలి అంతా. కావాలంటే కాయితం రాసుకో. సంతకం చేస్తా...అన్నారు. ఒకసారి దీన్ని చదువుకొని, ఆపైన నా మీదకు యుద్ధానికి రండి...." అంటూ కాగితం చేతిలో పెట్టాడు.

'జమీందారు'గా పిలవబడే అబ్బాయి తండ్రి ఒప్పందంలో ఉన్న ప్రకారం అమలు జరిగిన నాలుగు అంశాల్ని చూసి, తెల్ల ముఖం వేశాడు.

"1. అర లక్షకట్నం. 2. స్కూటర్. 3. కలర్ టి.వి. 4. పెళ్ళి ఘనంగా-గొప్ప డెకరేషన్‌తో, ఆర్భాటంగా జరిపించడం..."

అందులో భోజనాల ప్రస్తావన ఎక్కడా లేదు మరి.

○

# బహుమతి పొందిన కవిత

## 'ఉత్త' మనిషి!

గడిచాయి
నిండు నూరేళ్లు నేటికి
కోస్తావు
ఒక కేకును
నేను నీవైతే....
కాని
నా సమాధి పునాదులపై
ఒక సౌధం నిర్మించాలని
ఈనాడే తెలిపావు
నీ నిర్ణయం
నన్ను కూల్చుమని!
ఏమంటే
నిండాయి నూరేళ్లు నాకు
మరిచావు
ఎండలో వానలో
సుఖంలో, దుఃఖంలో
విందులకు, వినోదాలకు
నా నీడను గడిపిన క్షణాలు!
విస్మరించావు
నాఛాయలో
నువ్వేసిన పై ఎత్తులు
నువ్వు పన్నిన కుతంత్రాలు
నీ రహస్యాలు-ఎన్నో అన్నీ
నాకు, నా వాళ్లకు తెలును సుమా!
కాని నా వాళ్లు
నీలా, నీ వాళ్లలా
పగపట్టరు, ప్రతీకారం తీర్చుకోరు !
అయినా
తప్పించుకోలేవు
భగవంతుని న్యాయస్థానంలో
నీకు విధించబడే శిక్ష
నన్ను నరికి నేలకూల్చినందుకు-
ఒక్కమాట గమనించు
బ్రతికున్నా చచ్చినా నేనొక మహావృక్షాన్ని
నువ్వు మాత్రం ఎప్పటికి "పట్టి మనిషివే!"

-లక్ష్మీ కమలాకర్



శ్రీమతి లక్ష్మి కమలాకర్ "ఉత్తమనిషి" కవితా రచయిత్రి. లా డిగ్రీ పుచ్చుకున్నా శ్రీవారు ఆర్మీలో డాక్టరుగా పని చేస్తున్నందువల్ల వారితో వుండటం యిష్టంలేక వుపాధ్యాయినిగా పని చేస్తున్నారు.

"గత ఎనిమిది ఏళ్ళుగా వివిధ ఆంగ్ల, దిన, వార, మాసపత్రికలలో అనేక అంశాలపై వ్యాసాలు ప్రచురింపబడుతున్నాయి. అయితే తెలుగులో తొలి ప్రయత్నం దీపావళి కథలపై వ్యాస రచన పోటీలో పాల్గొనడం. 1984కి ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఆ వ్యాసానికి బహుమతి యిచ్చి ప్రోత్సహించడం. ఆ తర్వాత ఆంధ్రపత్రిక దినపత్రికలో చాలా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఒక ప్రముఖ పత్రిక సినిమా కథల పోటీలో "ఎదురు చూడని ఉదయం" అను స్వీయ రచన బహుమతి పొందింది. 89లో కలువబాల నిర్వహించిన "అందంగా అంటే ఎలా వుండాలి" అను అంశంపై వ్యాస రచన పోటీలో ద్వితీయ బహుమతి లభించింది.

అయితే మొత్తం మీద తెలుగులో వ్రాయాలన్న తహతహ కొద్దీ చేసిన ప్రయత్నాలు ఎక్కువ. పొందిన విజయాలు తక్కువ. అయినా అప్పుడప్పుడు మీలాంటి వారు అందించే ప్రోత్సాహం నా కలం కదిలేటట్టు చేస్తోంది" అంటున్నారు.